www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 25 సెప్టెంబర్ 2024
5
తిరుపతి



భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుమల బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్రెడ్డి సూచించారు. స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా పరిధిలోని డిపో మేనేజర్ తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ... ఇదంతా ఒకప్పుడు.. ప్రస్తుతం స్విమ్స్‌లో కార్పొరేట్‌కు 'రెడ్‌కార్పెట్' పరిచారు తప్ప, కార్పొరేట్ స్థాయి వైద్యం దొట్లే. 'లాభార్జనే టిటిడి వేట'.. ఇది సాధారణ జనం చెప్పే మాటలు కాదు.. స్వయానా టిటిడి ఉద్యోగులే అత్యవసర పరిస్థితుల్లో తమకెందుకు రాష్ట్రం సింపిసిస్కో, అపోలోకో పరుగులు తీస్తున్నారు. దశాబ్దాల పాటు శ్రీవారి సేవ చేస్తున్న టిటిడి ఉద్యోగులను కాపాడుకోవాల్సిన టిటిడి యాజమాన్యం ఆధునిక వైద్యం అందించడంలో మీనమేషాలు లెక్కిస్తున్న ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆదాయం కోట్లల్లో ఉన్నా.. వైద్యం



కొరత, సిబ్బంది లేకపోవడం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడం స్విమ్స్‌లో దీర్ఘకాలిక సమస్యలు.. ఎంతసేపు కాంట్రాక్టు, కాంట్రాక్టు, కాంట్రాక్టు.. డయాలసిస్ విభాగాన్ని 'నెఫ్రోప్లస్'కు అప్పగించేశారు. 20 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఏడుగురితో సరిపెడుతున్నారు. 120 మంది టెక్నీషియన్లు ఉండాల్సిన చోట కేవలం 27 మందే ఉన్నారు. ఒక్కసారే వాడాల్సిన డయాలైజర్‌ను పదిసార్లు వాడేస్తున్నారు. వైద్యసేవే ఉన్నతంగా భావించి విధుల్లో ఉన్న సీనియర్లు సైతం ఓ రకంగా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. దీంతో స్విమ్స్‌కు పోయి డయాలసిస్ పేషంట్లు 'ఇన్‌ఫెక్షన్లు' కొని తెచ్చుకుంటున్నారు.

'ప్రజాశక్తి' ఎక్స్‌క్లూజివ్ 1

నెఫ్రో ప్లస్ లైఫ్ లెస్

- కిడ్నీ రోగులకు 'డై'లైజర్ ప్రమాదం
- స్విమ్స్‌లో కొని తెచ్చుకుంటున్న 'ఇన్‌ఫెక్షన్లు'
- 20 మందికి గాను 7మంది డాక్టర్లతోనే సరి
- 120 మందికి బదులు 27 మందే టెక్నీషియన్లు
- ఐదేళ్లలో 600 మందికి పైగా మృతి



డయాలసిస్ కోసం...

ప్రజాశక్తి - తిరుపతి

'నెఫ్రోప్లస్' నిర్లక్ష్యం... కిడ్నీ రోగుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్)తో 2017లో చేసుకున్న ఎంఒయు ఒప్పందం ఒకటైతే దానికి భిన్నంగా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తోంది. 120 బెడ్లకు గాను కేవలం 80 బెడ్లతోనే సరిపెడుతోంది. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నైపుణ్యం కలిగిన సిబ్బంది, వైద్యుల్ని నియమించుకోకుండా వైద్యసేవలు అందిస్తోంది. ఫలితంగా ఐదేళ్లలో 600 మందికి పైగా రోగులు ఇన్‌ఫెక్షన్లతో మృత్యువాతపడినట్టు ఆంధ్రప్రదేశ్ కిడ్నీ రోగుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. తమకు ఇహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం) ఉన్నప్పటికీ నాణ్యమైన వైద్యానికి నోచుకోలేకపోతున్నామని తమ ప్రాణాలకు సంకటంగా డయాలసిస్ చేస్తున్నారంటూ ప్రభుత్వ టిటిడి ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. అటు స్విమ్స్ యాజమాన్యం, ఇటు ప్రభుత్వం స్పందించక పోవడం గమనార్హం.

రాయలసీమలో కిడ్నీ బాధితుల సహాయార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో 2017లో ప్రత్యేక డయాలసిస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. 100 అధునాతన డయాలసిస్ యంత్రాలను సమకూర్చారు. సమర్థవంతంగా రోగులకు డయాలసిస్‌ను తామే చేస్తామంటూ నెఫ్రోప్లస్ యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో 2017 జనవరిలో స్విమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఐఎస్‌ఎన్ (ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ) గైడ్‌లైన్స్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ప్రోటోకాల్ నిబంధనల్ని తూచా తప్పకుండా పాటిస్తామని నమ్మబలికింది. ఈ ప్రకారం 5 మెషిన్లకు ఒక డయాలసిస్ డాక్టర్, ఐదు మంది టెక్నీషియన్లు ఉండాల్సి ఉంది. ఈ లెక్కన 100 మెషిన్లు ఉన్న ఆస్పత్రిలో కనీసం 100 మంది క్వాలిఫైడ్ టెక్నీషియన్లతో పాటు అదనంగా 20 మంది డాక్టర్లను నియమించుకోవాలి. రోగులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మానసిక వైద్యులు, ఆహార నియమాలు చెప్పేందుకు డైటీషియన్లు తప్పకుండా ఉండాలి. ప్రైమ్ టైంలో (డయాలసిస్ చేసేటప్పుడు) 2 లీటర్ల సెలైన్‌తో మెషిన్‌ను శుభ్రపరచాలి. సింగిల్ యూజ్ డయాలైజర్‌ను వాడాలి. యాసిడ్, బైకార్బొనేట్ వాడాలి. కానీ స్విమ్స్‌లో ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లు, 27 మంది టెక్నీషియన్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. తాజాగా ఓ సీనియర్ జర్నలిస్టు మునికుమార్ డయాలసిస్ ఇబ్బందులతో మృతిచెందారు.

అత్యవసర చికిత్స చేయడం లేదు ?: జయరాం, బాధిత రోగి, తిరుపతి



బయట వేచి ఉన్న రోగులు

నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో రోజుకు నాలుగు షిఫ్టుల్లో ఉదయం 6 గంటలకు, 11 గంటలకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 8 గంటలకు డయాలసిస్ చేస్తున్నారు. ఒక్కో షిఫ్టుకు 9 గంటలకు వస్తారు. ఇలా ప్రతినెలా 1800 మంది డయాలసిస్ చేసుకుంటున్నారు. అయితే నెఫ్రోప్లస్ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, నాన్‌క్వాలిఫైడ్ సిబ్బంది ఆత్రత, ఒకే డయాలైజరును 10 సార్లు వినియోగించడం వల్ల తరచూ సైడ్ ఎఫెక్ట్ వస్తున్నాయి. రోగులు తీవ్ర అస్వస్థత గురవుతూ ప్రాణాపాయస్థితికి వస్తున్నారు. అయితే తమ వద్ద అత్యవసర చికిత్స అందుబాటులో లేదంటూ స్విమ్స్‌కు తరలిస్తున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ రోగి అయినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో రూ 7 నుంచి 10 వేలు వెచ్చించి వైద్యం తీసుకోవాల్సి వస్తోంది.

శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేట్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మంగళవారం పలువురికి ఛైర్మన్ పదవులు ఇస్తూ తొలిజాబితాను ప్రకటించింది. తిరుపతి జిల్లాకు చెందిన తెలుగు యువత అధ్యక్షులు రవి నాయుడు కి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ (శాప్) పదవిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే చంద్రగిరి నియోజకవర్గ అసెంబ్లీ పరిశీలకుడు ఊక విజయ్ కుమార్‌ను ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడుగా నియమించారు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొటారి హేమలతను టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యురాలుగా నియమించారు. అయితే తిరుపతికి చెందిన టిడిపి నేతలు మాత్రం పార్టీ అధిష్టానం పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లి అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారిని నామినేట్ పదవుల్లో వారి పేర్లు లేకపోవడంతో టిడిపి శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా టిడిపి పార్టీ అభ్యున్నతికి కషిచేసిన వారికి నామినేట్ పదవుల్లో మొదటి జాబితాలో వారు పేర్లు లేకపోవడంతో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వద్దకు వెళ్లి ఆశావాహులు అసంతృప్తి వెళ్ళగక్కారు. పార్టీకి కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వడం పట్ల టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే తన పరిస్థితి ఏందని ప్రశ్నిస్తున్నారు.

వూకా, కటారిలకూ చోటు



రవినాయుడు



వూకా విజయ్‌కుమార్

ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్‌గా పరసారత్నం

ప్రజాశక్తి - నాయుడుపేట



మూడు దశాబ్దాలుగా టిడిపికి ఎనలేని సేవలందిస్తూ, గతంలో సూళ్లూరుపేట టిడిపి ఎంఎల్‌ఎగా గెలుపొంది, రాష్ట్ర విద్యాశాఖామాత్యులుగా బాధ్యతలు చేపట్టిన పరసారత్నంకు ఎపి వ ా ర ్క ె ఫ ్ డ్ డైరెక్టర్‌గా అధినేత అవకాశం ఇచ్చారు. 2024లో పార్టీ టికెట్ ఇవ్వకపోయినప్పటికీ డాక్టర్ నెలవల విజయశ్రీ విజయానికి శ్రమించారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఛైర్మన్ పదవులతో పాటు, కొంతమంది డైరెక్టర్ల పేర్లను వెల్లడించింది. పరసారత్నంకు ఎంఎల్‌ఎ విజయశ్రీ శుభాకాంక్షలు తెలిపారు.

అందరిలో సేవాతత్వం పెరగాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి అందరిలో సేవా తత్వం పెరగాలని డాక్టర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సి రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను, సిద్ధాంతాలను సి ఆర్ రెడ్డి విద్యార్థులకు ఉపదేశించారు. ఎన్ఎస్ఎస్ లో భాగస్వాములు కావడం వల్ల క్రమశిక్షణ, సేవా భావం, సామాజిక బాధ్యత అలవడుతాయని తెలిపారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ యశోద, కామర్స్ అధ్యాపకురాలు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

మన్నవరం అంగన్వాడీపై రాజకీయ 'వేటు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నేతల రాజకీయ వేధింపులకు తొట్టతొలి స్కీం వర్కర్ బలయ్యింది. శ్రీకాళహస్తి రూరల్ మండలం మన్నవరం అంగన్వాడీ కార్యకర్త వి.గాయత్రిని విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే గాయత్రి తొలగింపు అంశంలో కూటమి నేతలు పెద్ద కుట్రనే చేశారన్నది యూనియన్ నేతల ఆరోపణ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మన్నవరం అంగన్వాడీ కార్యకర్త గాయత్రిపై రాజకీయ వేధింపులు మొదలు పెట్టారు. ఆమె భర్త ఓ రాజకీయ పార్టీలో కీలక నేత కావడం, గత ఎన్నికల్లో కూటమికి వ్యతిరేకంగా పనిచేసిందన్న నెపం చూపి స్థానిక కూటమి నేతలు కుట్ర పన్నారు. ఆమెపై తప్పుడు ఫిర్యాదులు చేశారు. నేతలకు ప్రభుత్వ అధికారుల సహకారం కూడా తోడవ్వడంతో మూడు నెలల పాటు గాయత్రిపై వేధింపుల పర్వం కొనసాగించారు. సీడీపీఓ నుంచి ఎంపీడీవో, ఎంఈవో వరకూ గాయత్రిపై విచారణకు వెళ్లడం గమనార్హం. గాయత్రిపై రాజకీయ వేధింపులు మానాలని స్కీం వర్కర్లు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఘోషించినా ఆఖరుకు కూటమి నేతలు తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. ఈ కోణంలోనే మరింతమంది స్కీం వర్కర్లపై వేటు వేసేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేసినట్లుగా తెలుస్తోంది.

తొలగింపు అన్యాయం: గాయత్రి, బాధితురాలు

న్యాయబద్ధంగానే అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరాను. రాజకీయాలకతీతంగా నాలుగేళ్ల పాటు సక్రమంగా విధులు నిర్వార్తించా. అయినా రాజకీయ కుట్రతో అన్యాయంగా నన్ను బలి చేశారు. విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాటు లేకున్నా తప్పుడు ఫిర్యాదులతోటి నాపై వేటు వేయడం అన్యాయం.

స్టాండింగ్...రాయబా(బే)రం

- 4న 'స్టాండింగ్' కౌన్సిల్ ఎన్నికలు
- పట్టు నిలుపుకునేలా వైసిపి యత్నం
- కార్పొరేటర్లకు జనసేన కూటమి 'ఎర'


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నిక అక్టోబర్ 4న జరగనుంది. ఈ ఎన్నికల్లో వైసిపి కార్పొరేటర్లకు ఎరవేసి గెలుపొందాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు కుమారుడు కార్పొరేటర్లకు 'బిస్కెట్లు' వేయడంలో ముందున్నారు. వైసిపి నుంచి మేయర్‌గా డాక్టర్ శిరీష ఉన్నారు. రెండు రోజుల క్రితం తిరుపతి మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. తమ పట్టు సాధించుకునేందుకు కార్పొరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి 22 మంది హాజరయ్యారు. అందులో నలుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. మరో 10 మంది ఇతర పనులమీద ఉండటం వల్ల ఈ సమావేశానికి రాలేదని వైసిపి నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి పార్టీకి 12 మంది కార్పొరేటర్లు ఉన్నట్లు సమాచారం. ప్రతి సంవత్సరం స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే గత మూడేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించకుండా వారే కొనసాగుతూ రెన్యువల్ చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగరేయడానికి పావులు కదుపుతున్నారు.

2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. 35వ డివిజన్‌ను టిడిపి దక్కించుకుంది. 26వడివిజన్ వైసిపికి చెందిన కార్పొరేటర్ హనుమంతనాయక్ అనారోగ్యంతో మృతిచెందారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజీనామా చేశారు. ఏడో డివిజన్ ఎన్నిక సంబంధించి కోర్టులో కేసు ఉంది. మూడేళ్లుగా వైసిపికి చెందిన వారే స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఇందులో మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, 25వ డివిజన్ నరసింహాచారి, రెండో డివిజన్ ఉమ, మూడో డివిజన్ గణేష్, 12వ డివిజన్ ఎస్‌కెబాబు ఉన్నారు. ఈ స్టాండింగ్ కమిటీ సభ్యుల్లో భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేశారు. నరసింహాచారి జనసేనలో కొనసాగుతున్నారు.

వైసిపి కార్పొరేటర్లకు రాయబారం

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు తగినంత బలం లేకపోవడంతో వైసిపి కార్పొరేటర్లను జనసేనలో చేర్చుకోవాలని భావిస్తున్నారు. కులాలవారీగా రాయబారాలు నడుపుతున్నారు. కూటమి అధికారంలోకి రావాలంటే కనీసం 26 నుంచి 27 మంది కార్పొరేటర్ల మద్దతు ఉండాలి. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఐదుగురిని మాత్రమే ఎన్నుకోవాలి. ఒక్కో కార్పొరేటర్ ఐదుగురికి ఓటేసి ఎన్నుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 1-3 తేదీల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తిరుపతికి రానున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి కార్పొరేటర్లను జనసేనలో చేర్చుకునేలా ప్రయత్నాలు ముమ్మరం



చేశారు. ఒకవేళ కూటమిలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయకపోతే ఎన్నికలను వాయిదా వేసే అవకాశం లేకపోలేదు.

స్టాండింగ్ కమిటీకి రూ.10 లక్షలకు అవకాశం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సభ్యులుగా గెలిచేవారికి రూ.10 లక్షల వరకూ ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాల్లో టెండర్ లేకుండా పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రతినెలా స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, నిర్ణయాలను కౌన్సిల్లో ఆమోదం పొందేలా చేస్తారు. స్టాండింగ్‌కమిటీ నిర్ణయాలు మేయర్ సమక్షంలో జరుగుతాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు సైతం పెద్దసంఖ్యలో పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆశాలపై రాజకీయ వేధింపులు తగవు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆశాలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆశాల యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశాలు ప్రజారోగ్యమే లక్ష్యంగా రాజకీయాలకతీతంగా అహర్నిశలు పని చేస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వాలు మారిన ప్రతీసారి పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలాగా పాలకులు స్కీమ్ వర్కర్ల గొంతుపై కత్తి పెట్టి తొలగించాలని చూస్తున్నారని వాపోయారు. పాలకులు ఈ విధానానికి స్వస్తి పలకాలని హితవు పలికారు. అదేవిధంగా ఆశాలను ఈ మధ్య కాలంలో రాత్రి డ్యూటీలు కూడా చేయాలని బలవంతపెడుతున్నారనీ, చేయకుంటే శాఖాపరమైన తీసుకుంటామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు.



కనీసం వాచ్ మెన్ సౌకర్యం కూడా లేని పీహెచ్సీల్లో మహిళలకు రాత్రి డ్యూటీలు సమంజసమేనా అంటూ ప్రశ్నించారు. పెరిగిన నిత్యావసర ధరల రీత్యా ప్రభుత్వం తమికిస్తున్న రూ.10 వేల జీతం ఏ మూలకీ చాలడం లేదనీ, కనీస వేతనం చట్టం ప్రకారం రూ. 26 వేలివ్వాలని డిమాండ్ చేశారు. ఆశా యూనియన్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి పి. లక్ష్మి, ఉషా, సరళ, చెంగాలమ్మ, రాణి, అను, సీఐటీయూ నాయకులు గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

పుల్లారెడ్డికండ్రిగలో 'ట్రెంచ్' వివాదం


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వాలు మారుతున్న ప్రతి 'సారీ' నిబంధనలు మారుతున్నాయే తప్పా ఇసుక దోపిడీ మాత్రం ఆగడం లేదు. అధికారం మారిన ప్రతి'సారీ' కొత్త ఇసుకాసురులు పుట్టుకొస్తున్నారే తప్పా ఇసుక అక్రమ రవాణాకు ఆనకట్టలు పడట్లేదు. వడ్డించేటోడు మనోడైతే.. ఏ బంతిలో కూర్చున్నా ఆకు నిండుద్ది' అన్న సామెత చందాన పర్యవేక్షణాధికారుల ఉదాసీన వైఖరికి జతగా అధికారం అండ తోడవుతుండడంతో ఏ ప్రభుత్వం వచ్చినా అక్రమార్కులు రెచ్చిపోతూనే ఉన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలోగత కొద్ది రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓ కూటమి నేత కనుసన్నల్లో ఇదంతా జరుగుతోంది. ఇక్కడ దొరికే నాణ్యమైన ఇసుకను శ్రీకాళహస్తి

కందకాన్ని పూడ్చి ఇసుక తోడేస్తున్న వైనం

పట్టణంలో పలు సమీప ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే నదిలో ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భజలాలు అడుగంటిపోతాయనీ, శ్మశాన దిబ్బలు దెబ్బతింటాయని భావించిన రైతులు ట్రాక్టర్లు నదిలోకి పోకుండా సోమవారం ట్రెంచ్ కొట్టి అడ్డుకున్నారు. దీంతో రైతులు, అక్రమార్కుల మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. తిరిగి ముఖ్య నేత నుంచి అనుమతి వచ్చిందంటూ మంగళవారం ట్రెంచ్ ను పూడ్చి అక్రమార్కులు తవ్వాకాలు చేపట్టడం గమనార్హం. దీనిపై శ్రీకాళహస్తి తహశీల్దార్ ను వివరణ కోరగా.. సమస్య తన దష్టికి వచ్చిందనీ, పరిశీలించి వెంటనే చర్యలు చేపడతామని వివరణ ఇచ్చారు.





గ్రామస్తులు వద్దన్నా అక్రమంగా లోడేస్తున్న ఇసుక

సమాచార హక్కు చట్టాన్ని పునరుద్ధరించాలి

టిటిడికి కందారపు మురళి హితవు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో మరింత పారదర్శకత పెంచడానికి సమాచార హక్కు చట్టాన్ని పునరుద్ధరించాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీలో పారదర్శకత కరువవుతున్న నేపథ్యంలో సమాచార హక్కు చట్టానికి ప్రాధాన్యత ఉందని ఆయన గుర్తు చేశారు. గతంలో సమాచార హక్కు చట్టం ద్వారా అనేక అవకతవకలను వెలికి తీసిన విషయాలను గుర్తు చేశారు. అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సమాచార హక్కు చట్టం ఒక అంశానికి వర్తించదని కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని అనుసరించి అది టీటీడీకీ వర్తిస్తుందని చట్టాన్ని అమలు చేయడం లేదని కందారపు మురళి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ ఛైర్మన్ ఏడాదిలో మూడున్నర లక్షల దర్శనాల లేఖలు ఇచ్చినట్టు మీడియాలో వెల్లడి అయిందని, ఒక్క ఛైర్మన్ వ్యవహారంలోనే ఇంత పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరిగితే బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులు, మీడియా, జ్యుడీషియరి, రెవెన్యూ, పోలీసు తదితర విభాగాలతో పాటు బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయం ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ఎన్ని లేఖలు పంపుతున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. రాష్ట్రాల పరిధిలోనే ఇలా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి, కేంద్ర స్థాయి సంస్థల నుంచి ఎన్ని రకాల వత్తిడిలు ఉంటాయో అంచనా వేయవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు. తిరుమల కొండ జేఈవో కార్యాలయం నుంచి వీఐపీ లకు ఇచ్చే దర్శనాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రకటించాలని, ఇవన్నీ సమాచార హక్కు పరిధిలోకి వచ్చినప్పుడు మాత్రమే నియంత్రణ ఉంటుందని ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం సమాచార హక్కు చట్టాన్ని టిటిడి కి వర్తింపజేయాలన్నారు. ప్రతిరోజు దర్శనాల వివరాలను వీఐపీల వివరాలను వెల్లడి చేయాలని కందారపు మురళి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే తప్పులను సరిదిద్దడానికి అవకాశం ఉంటుందని సూచించారు.

కార్పొరేషన్ ఇఇలుగా గోమతి, తులసికుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు వారు కోరిన చోట బదిలీలు కాకపోవడంతో చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలామంది టిడిపి జనసేన కూటమి పార్టీల ఎమ్మెల్యే నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకొని పలానా స్థానం కోసం సిఫార్సు తెచ్చుకున్నప్పటికీ వారిని ఇతర ప్రాంతాల్లో నియమించడం జరిగింది. దీంతో చాలా మంది ఇంజనీర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పి.గోమతి, ముక్కు తులసి కుమార్‌ను నియమిస్తూ మున్సిపల్ పట్టణ అభివద్ధి శాఖ ఉన్నత ధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈఈగా పనిచేస్తున్న పి.గోమతి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఈఈగా విచ్చేశారు. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఈఈగా పనిచేస్తున్న ఎం.తులసి కుమార్ ను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎంఈగా నియమించారు. అలాగే తిరుపతి పబ్లిక్ హెల్త్ విభాగంలో ఈఈ దేవిక రెడ్డి కడప జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఈఈగా బదిలీ అయ్యారు. కడప జిల్లా క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఈఈగా పనిచేస్తున్న సుబ్బరాయుడు తిరుపతి పబ్లిక్ హెల్త్ ఈఈగా నియమించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో డీఈ లుగా పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో డిఇగా పనిచేస్తున్న రవీంద్రారెడ్డిని నగిరి మున్సిపాలిటీకి నియమించారు ఆయన స్థానంలో నంద్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎం మధు కుమార్‌ను నియమించారు. మరో డిఈ విజయ్ కుమార్ రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ డిఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో డి ఈ గా పనిచేస్తున్న రమణాను తిరుపతికి కార్పొరేషన్‌కు నియమించారు .శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న లలితను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డీఈ గా నియమించారు. ఇక్కడ డిఇగా పనిచేస్తున్న సంజయ్ కుమార్ శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి అయ్యారు. తిరుపతి కార్పొరేషన్‌లో డిఈ గా పనిచేస్తున్న టి శ్రావణి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు ఆమె స్థానంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న వరప్రసాద్‌ను తిరుపతి కార్పొరేషన్‌లో డిఈగా వేశారు. నగిరి మున్సిపాలిటీలో డిఈ గా పనిచేస్తున్న నరేష్ తుడా ఇంజనీరింగ్ విభాగంలో డిఈగా నియమితులయ్యారు. వీరంతా రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.



శ్రీవారి సేవలో ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అక్టోబర్ 4వ తేదీ జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా జరిగేలా చూడాలని, ఏర్పాట్లను బ్రహ్మాండంగా చేయాలని దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి విచ్చేస్తారని చెప్పారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయక మండపం నందు మంత్రికి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలకగా, అదనపు ఈఓ ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. లడ్డు నాణ్యతపై ఎక్కడ ఏం జరిగిందన్న విషయం సిట్ నివేదికలో బయట పడుతుందని చెప్పారు. .

నగరి ఎంఎల్ఏను కలిసిన టిటిడి జెఎసి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నగరి శాసనసభ్యులు గాలి భానుప్రకాష్‌ను టిటిడి జాయింట్ యాక్షన్ కమిటీ, టిటిడి ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసారు. పాదిరేడు వద్ద టిటిడి ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల అభివృద్ధి పనుల గురించి, ఇబ్బందుల గురించి చర్చించారు. అక్కడ రైతులలో కుటుంబ వివాదాలు, భూమిపై ఉన్న హక్కులపై, వున్న వివాదాల కారణంగా ఇంకా కొంతమందికి డబ్బులను ప్రభుత్వం చెల్లించాల్సి వుంది. కొంతమంది రైతులు ప్లాట్లకు ఉన్న హద్దులను తొలగిస్తున్నారని, వారికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించాలని కోరారు. కోర్టు వివాదాలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని కోరారు. ఎంఎల్‌ను కలిసిన వారిలో గోల్కొండ వెంకటేశం



ఎంఎల్ఎను కలిసిన టిటిడి జెఎసి నాయకులు

,గంపల వెంకటరమణారెడ్డి, మేడికొండ ప్రసాదరావు, మల్లారపు నాగార్జున, పూజారి.రత్న ప్రభాకర్ ఉన్నారు.

పైప్ లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని విద్యానగర్ నుండి నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి వెళ్లే పైప్ లైన్ ఇటీవల ఒక కారు ప్రమాదవశాత్తు పడిపోవడంతో పైప్ లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. సమాచారం తెలుసుకున్న గూడలి ఉప సర్పంచ్ పల్లెమల్లు విజయసారధి రెడ్డి తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరుపల్లి, కొత్తపాలెం గ్రామస్తులు పల్లెమల్లు విజయ సారధిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పల్లెమల్లు విజయసారధి రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో ఇలా సమ స్యలు వస్తే సత్వర చర్యలు చేపడుతామని తెలిపారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో బహుళ జాతి కంపెనీలైన శ్రీ సిటీకి చెందిన డైకిన్ ఎయిర్ కండిషనర్ కంపెనీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అల్ట్రా మెరైన్ పిగ్మెంట్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, ఇంటర్ , ఐటిఐ, డిప్లొమా, బిటెక్, డిగ్రీ పాసైన యువతీయువకులు ఇంటర్వ్యూకి అర్హులని తెలిపారు. హాజరై యువతీ యువకులు హెచ్‌టిటిపి:// స్కిల్ యూనివర్స్.ఎపిఎస్ఎస్‌డిసి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8639835953 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని కాపు వీధి బాలికల ఎంపియుపి పాఠశాలలో స్థానికుడు రమేష్ స్వామి (పురోహిత్), ధనలక్ష్మి దంపతులు విద్యార్థులను దాదాపు 15 వేల రూపాయల విలువ చేసే నోట్సులు, పలకలు, పేనాలు, పెన్సిళ్లు, బిస్కెట్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బి తిరుమల రాజు, బాల సుబ్రహ్మణ్యం, ఆడిటర్ రామకృష్ణ , టిఆర్‌విజయ కుమార్, ఫాన్సీ స్టోర్ మధు, పాఠశాల ఛైర్మన్ ముంతాజ్, ప్రధానోపాధ్యాయులు ఎం మల్లి కారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి ఇందిర, టిడిపి మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం'ను సోమవారం మండల అధికారుల సమక్షంలో నిర్వహించారు. టిడిపి కూటమి నాయకులు కలిసి ఇంటి ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం అందరి మంచి కోరే ప్రభుత్వమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం – ప్రజా వేదిక' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం పెద్దకన్నలిలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, రావిళ్ళ ముని రాజా నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, జయచంద్ర నాయుడు, గుర్రప్ప పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: కూరపత్తివారిపల్లి పంచాయతీ ఆవులయ్య గారి పల్లిలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం'ను నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈశ్వరమ్మ, టిడిపి జిల్లా కార్యదర్శి అన్నాసముద్రం మధు, రెడ్డి బాబు, వాసు, సుధాకర్, కుమార్, భాస్కర, లోహిత్, మనోరమ పాల్గొన్నారు.

విజ్ఞానాభివృద్ధిని పెంపొందించాలి: ఎంఈవో

ప్రజాశక్తి -రామచంద్రాపురం: విద్యార్థు లలో విజ్ఞాన అభివృద్ధిని పెంపొం దించాలని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ అన్నా రు. మంగళ వారం గంగిరెడ్డిపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశా లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి వారీగా విద్యార్థు ల ప్రగతిని, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యాప్రవేశంలో భాగంగా 90 రోజుల కార్యక్రమాలను క్రమం తప్పకుండా పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణ పాల్గొన్నారు.

జీవితంలో లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలి: టిటిడి డీఈవో

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కష్టపడి పట్టుదలతో విజయం సాధించాలని టిటిడి డిఈఓ వై నాగరాజు నాయుడు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సిభువనేశ్వరి దేవి అధ్యక్షతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం చేశారు. మొదట అతిథులు చేత ఈ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. ఎల్ఈడి టీవీని వితరణ చేసిన సంతోషిమాత ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రసాద్ రావు, సతీష్, చంద్రశేఖర్ లను ప్రిన్సిపల్,డిఈఓ అభినందించి, అనంతరం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి విద్యార్థి సంఘం ఏర్పాటు చేసి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమారాణి, డాక్టర్ పరమేశ్వర, విద్యార్థి సమాఖ్య సభ్యులు డాక్టర్ జయమ్మ, హాస్టల్ వార్డెన్ డా. స్నేహలత, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో రాయితీపై బిసీల హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో షాపుల కేటాయింపులో ఈడిగ గౌడ కులస్తులు, కల్లుగీతపై ఆధారపడిన వారికి 10 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకోవడంపై తిరుపతి జిల్లా బిసి సంఘాల అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ఎన్టీఆర్ హయాంలో కల్లుగీత కార్మికులకు ఎన్నో ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలను అందించారన్నారు. ఈ సమావేశంలో చెంగల్రాయులు, నారాయణ స్వామి, రాజశేఖర్, ఆనంద్ గౌడ్, మునిశేఖర గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ, ఏపిఎం బాధ్యతల స్వీకరణ


ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బదిలీల్లో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ విద్యుత్ శాఖ ఏఈగా చలపతి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఐరాల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ పుణ్య కోటి రేణిగుంట మండలానికి బదిలీ అయ్యారు. ఏపీఎంగా సిహెచ్ మునెయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాళహస్తి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఇందిరమ్మ తొట్టంబేడు మండలానికి బదిలీపై వెళ్లారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -నాయుడుపేట: నవజీవన్ ఆర్గనైజేషన్ సిసి పియు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా?' కార్యక్రమం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నాయుడుపేట డాక్టరు సివి రామన్ డిగ్రీ కాలేజిలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆ ప్రాజెక్ట్ మేనేజర్ కె బాలాజి మాట్లాడుతూ, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో కాలేజ్ ప్రిన్సిపాల్ జివివి గోపాల్ , ఇతర లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలం డాక్యుమెంట్లు ఫోర్జరీపై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: తమ పొలాన్ని నకిలీ డాక్యుమెంట్లతో కాజేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ముక్కామల గిరిధర్ ఎస్పీ సుబ్బరాయుడికి మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ కాంబాకం రెవెన్యూ లోని తమ పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లును స్థానికంగా ఒక సంస్థకు చెందిన కొందరు వ్యక్తు లు ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ పొలాన్ని వాళ్ల పేరుపై మార్చుకోవడానికి ప్రయత్నించడమే కాక, తమను బెదిరిస్తున్నారని వారి నుండి ప్రాణహాని ఉందని తెలిపాడు. తమ పొలం డాక్యుమెంట్లని ఫోర్జరీ చేసి రేణిగుంట రిజిస్ట్రార్ కార్యాలయం లో దొంగ మార్ట్ గేజ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ముక్కామల గిరిధర్ ఎస్‌పిని కోరానని తెలిపాడు. స్పందించిన ఎస్‌పి డాక్యు మెంట్లు పరిశీలించిన అనంతరం విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారన్నాడు. గత ప్రభుత్వంలో దీనిపై కలెక్టర్‌కి, ఎస్‌పికి పలుమార్లు స్పందన ద్వారా ఫిర్యాదు చేసినా న్యాయం జరగ లేదని, న్యాయం చేయకుంటే ప్రజా దర్బార్ ద్వారా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని బాధితుడు తెలిపాడు.



ఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితుడు గిరిధర్

నిత్య పెళ్లికొడుకు పోలీస్ కానిస్టేబుల్ ఏలుమలై రెడ్డి?

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆయన ఓ పోలీస్ కానిస్టేబుల్.. పదిమందికి న్యాయం చేసే వ్యక్తి.. కానీ తాను కుటుంబ విషయంలో మాత్రం అతడి తల్లి ప్రోద్బలంతో భార్య, బిడ్డలకు అన్యాయం చేస్తున్నాడు.. ఎందుకంటే అతడు నిత్య పెళ్లి కొడుకులా ఉండాలన్నదే అతడి జీవిత ఆశయమని తెలుస్తోంది. 35 ఏళ్ల వరకు ఒకే భార్య.. ఆ వయసు దాటిన తర్వాత రెండో పెళ్లి చేసుకుని రెండో భార్యతో కాపురం ఉంటూనున్నాడు పోలీస్ కానిస్టేబుల్ ఏలుమలైరెడ్డికి సంబంధించిన కథనం ఇదీ.. బాధితురాలు అతని భార్య ఉషకు జరిగిన అన్యాయంపై ఆగస్టు 26న తిరుపతి ఎస్‌పికి ఫిర్యాదు చేసింది..ఏర్పేడు మండలం రాజుల కండ్రిగకు చెందిన గాలి రంగారెడ్డి, పుష్పమ్మల కుమారుడు గాలి ఏలుమలై రెడ్డి తిరుపతి ఎస్‌పి కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి 2008, మే 7వతేదీ ఉష తో పెద్దల సమక్షంలో వివాహమైంది. ఇతడికి పెళ్లి కాకముందే అమ్మాయిలతో సంబంధాలు వుండేవని బాధితురాలు పేర్కొంది. పెళ్లయిన కొద్ది రోజులు వరకు భార్య భర్తల మధ్య దాంపత్య జీవితం సజావుగానే ఉండేది. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ప్రస్తుతం పెద్ద అబ్బాయి ఆనంద్ కుమార్ పదవ తరగతి, రెండో అబ్బాయి భరణి 9వ తరగతి చదువుతున్నాడు. గతంలో భార్య ఉషను అతడి తల్లి పుష్పమ్మ ఒత్తిడితో శారీరకంగా, మానసికంగా కొట్టి వేధించేవాడు. దీనిపై అప్పట్లో పుత్తూరు పోలీస్ స్టేషన్లో అతడి పై ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిని పిలిపించి మందలించారు. ఇకనుండి తన భార్యను బాగా చూసుకుంటానని పోలీస్ స్టేషన్లో హామీ పత్రం రాసి మళ్లీ రాజుల కండ్రిగకు తీసుకెళ్లాడని తెలిపింది. మళ్లీ కొద్ది రోజులు బాగానే చూసుకున్నాడని ఆ తర్వాత మళ్లీ వేధింపులు మొదలయ్యాయని పేర్కొంది. వారం క్రితం ఓ అమ్మాయి ఫోటో చూపించి 'నేను రెండో పెళ్లి చేసుకు న్నాను.. నువ్వు వెంటనే నాకు విడాకులు ఇవ్వు.. లేకుంటే నిన్ను, నీకు అండగా వున్న మీ అన్నను చంపేస్తాను..!' అని బెదిరిస్తూ చిత్రహింసలకు గురి చేస్తూ ఇంట్లో నుంచి గెంటివేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై 2024, ఆగస్టు 22వ తేదీ ఏర్పేడు పోలీస్ స్టేషన్ లో బాధితురాలు ఉష ఫిర్యాదు చేసింది. ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ హబీబుల్లా ఇద్దరిని పిలిపించి సర్ది చెప్పి ఇంటికి పంపించారు. 'ఆ తర్వాత వేధింపులు ఇంకా రెట్టింపు అయ్యాయని, వెంటనే విడాకులు ఇవ్వాలని వేధించాడని తెలిపింది. దీంతో బాధితురాలు ఉష ఎస్పి కార్యాలయానికి చేరుకుని ఎఎస్‌పికి ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పోలీసు ఉన్నతాధికారులు ఏలుమలై రెడ్డిని పిలిపించి బాధితురాలకు ఉషకు న్యాయం చేస్తారా? లేకుంటే సర్ది చెప్పి మళ్లీ పంపిస్తారా తెలియడంలేదు. బాధితురాలు తమ కొడుకులతో ఎక్కడికి వెళ్లాలో తెలియక అయోమయ స్థితిలో అగమ్యగోచరంగా మారింది.

తిరుపతి అటవీశాఖ పరిధిలో బదిలీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి అటవీశాఖ సర్కిల్ పరిధిలో డిఎఫ్ఓ, సబ్ డిఎఫ్ఓ, కార్యాలయ ఉద్యోగుల బదిలీ చేస్తూ అటవీ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారిగా పనిచేసిన సతీష్ ఎన్టీఆర్ జిల్లాకు డిఎఫ్ఓగా బదిలీ అయ్యారు. సతీష్ స్థానంలో ఐఎఫ్ఎస్ అధికారిని నియమించనున్నట్లు తెలుస్తోంది. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా శివకుమార్ కడప జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా డీఎఫ్‌వోగా శ్రీనివాసులు నియించారు. తిరుపతి బయోట్రిమ్ అసిస్టెంట్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా, ఎర్రచందనం కేంద్రీయ గోదాము ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎన్. శివకుమార్ సాంగ్లా మంగళగిరిలోని పీసీసీఎఫ్ కార్యాలయం విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. తిరుపతి బయోమెట్రిమ్ ఏసీఎఫ్ గా చిత్తూరు సామాజిక అటవీశాఖ డీఎఫ్ వో కె. సోమశేఖరన్ నియామకమయ్యారు. తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా పనిచేసిన టి శ్రీనివాసరావు రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. సీసీఎఫ్ కార్యా లయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న సివిరత్నం అనంతపురం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు నుంచి హిమబిందు బాధ్యతలను స్వీకరించనున్నారు. తిరుపతి జిల్లా అటవీశాఖ కార్యా లయం పరిపాలన అధికారిగా పనిచేస్తున్న అప్పారావు విజయనగరానికి బదిలీ అయ్యారు.

మెడికల్ షాప్ యజమానులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): వైద్యులచే వైద్య పరీక్షలు చేయించుకుని ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాప్ నుండి మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం చంద్రగిరిలోని మెడికల్ షాపుల యజమానులతో చంద్రగిరి పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటై , డ్రగ్స్‌కు బానిసరైన సందర్భంలో పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. మైనర్లకు ఎలాంటి ఔషధాలను ప్రిస్క్రిప్షన్ లేకుండా ముందు ఇవ్వకూడదన్నారు. మెడికల్ షాప్‌లో ముందు ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమాలను ఆదేశించారు. మెడికల్ షాపుల యజమానులకు ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల నుండి ఇష్టం వచ్చినట్లు ఔషధాలు అమ్మితే ఏపీ పబ్లిక్ సేఫ్టీ మీషర్ యాక్ట్ 2013 మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చంద్రగిరిని మత్తు రహిత చంద్రగిరిగా తీర్చి దిద్దుడానికి అందరూ సహకరించాలని కోరారు.

'చిన్నారి ధరణిని ఆదుకోండి'

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: బాధిత చిన్నారి ధరణిని ఆదుకోవాలని టీటీడీ ఎస్‌డబ్ల్యుయుఎఫ్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గోల్కొండ వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వారం రోజుల క్రితం కడుపునొప్పి తో సెంట్రల్ హాస్పిటల్ కు ధరణిని తల్లి అరుణ తీసుకెళ్లగా అ తల్లిదండ్రులు నిర్ఘాంత పోయే నిజం వెల్లడైందని లివర్ ట్రాన్సపరెంటు చెయ్యాలని వారికి తెలియడంతో చెన్నై గ్లోబల్ హాస్పిటల్‌లో చేర్పించారని పరీక్షలు నిర్వహించిన తరువాత ధరణి తండ్రి లివర్ సూట్ అయ్యిందని, లివర్ ట్రాన్సుప్లాంటేషన్ కోసం సుమారు 16 నుండి 17 లక్షలు అవుతుందని తెలిపారన్నారు. ఈ విషయం తెలుసుకొన్న సహా సిబ్బంది రికార్డ్స్ సెక్షన్ జెఈఓవో (హెచ్‌అండ్ ఇ)ని కలిసి చిన్నారని ఆదుకోవాలని కోరామన్నారు. జేఈవో వారు ప్రాణదానం ద్వారా సాయం మంజూరు చేసేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ విషయం శనివారం సాయంత్రం తమ దృష్టికి రాగానే అరుణ కుమారితో మాట్లాడాడని, మళ్లీ రక్తం కావాలని తెలియగానే గ్రూపులలో సమాచారం అందించి చెన్నై లో వుంటున్న తమ పెద్ద అల్లుడు నిరంజన్ ను వారి ఫ్రెండ్స్ ద్వారా సహాయం చేయాలని కోరామన్నారు. మంగళ వారం తమ కూతురు అల్లుడు వెళ్లి అరుణాకుమారితో మాట్లాడి ప్లేట్‌లేట్స్ ఇచ్చి వచ్చారన్నారు. మధ్యాహ్నం జేఈవో గౌతమిని కలిసి ఆ కుటుంబాన్ని ఆదుకో వాలని కోరామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధరణి లివర్ ట్రాన్స్‌ప్లాంటే షన్‌కు అయ్యే ఖర్చుని టీటీడీ యాజమాన్యం భరించాని అందుకు అనుగుణంగా ఈవో , ఇతర ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వెంకటేశం పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి..

మున్సిపల్ కమిషనర్‌కు టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణాభివృద్ధికి సహకరించాలని పుత్తూరు పట్టణ టిడిపి నాయకులు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను టిడిపి నాయకులు మంగళవారం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు జీవరత్నం నాయుడు మాట్లాడుతూ నూతన కమిషనర్ మంజునాథ్ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణ సర్వతోముఖాభివృద్ధికి సహకరిం చాలని కోరారు. పారిశుధ్య లోపాలు లేకుండా చూడాలన్నారు. తెలుగు గంగ పైప్ లైన్ సిద్ధార్థ కళాశాల వరకు వచ్చి పనులు ఆగిపోయాయని వాటిని పూర్తి చేసి సమ్మర్ స్టోరేజ్ వద్దకు తీసుకెళ్లి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. పారిశుధ్యం కార్మికులు కొరత లేకుండా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, కౌన్సిలర్ కేశవాచారి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆనంగి ఆనంద్, మాజీ కౌన్సిలర్లు బాబు నాయుడు, విఎంగోపి ఆచారి, టిడిపి నాయకులు కె వెంకటేష్, బిఆర్‌మురళీకృష్ణ, కేశవ, బాబు పాల్గొన్నారు.



కమిషనర్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

విదేశీ వైద్య బృందం పర్యటన

ప్రజాశక్తి- బుచ్చి నాయుడు కండ్రిగ: ఆఫ్రికన్ ఇథియోపియా దేశం నుండి ట్రియం ప్రాజెక్టులో భాగంగా వచ్చిన విదేశీ బృందం 'ఫర్ హెల్తీబేబీ'పై శిక్షణ నిమిత్తం గర్భకోశ వ్యాధుల నిపుణులు, చిన్నపిల్లల వైద్యులు, సామాజిక ఆరోగ్య అధికారుల బృందంతో పాటు ఎస్‌వి మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసిం, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ వినాయక్, డాక్టర్ హరి, డాక్టర్ వైష్ణవి బృందం బుచ్చినాయుడుకండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , వివిఎస్ పురం వెల్నెస్ సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. క్షేత్రస్థాయి గ్రామీణ ప్రాంతంలో గర్భిణులకు, పిల్లలకు, ఆశా కార్యకర్త సేవలు, ఏఎన్ఎం సేవలు, ఎంఎల్‌హెచ్‌పి సేవలు ఎలా అందిస్తున్నారు?' తదితర వివరాలు తెలుసుకుని రిజిస్టర్స్, రికార్డ్స్ గురిం చి తెలుసుకొని 104, 108, 102 సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు, ప్రసవాలు, ప్రతి నెల 9వ తేదీ లోపు అందించే పిఎంఎస్ ఎంఎ, గర్భిణులకు పారితోషికం పిఎంఎంవిఐ, జెఎస్‌వై, ఆరోగ్య ఆసరా , తదితరాల గురించి ఆరోగ్యా ధికారి డిఎన్ వెంకటేశ్వర్లు వివరించారు. వీటిని పరిశీలించిన విదేశీ బృందం ప్రశం సించింది. ఇలాంటి కార్యక్రమాలను తమ ఆఫ్రికన్ దేశంలోనూ అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు సూపరు వైజరు జ్యోతి, ఎంఎల్ హెచ్ పి పద్మశ్రీ, ఏఎన్ఎంఈశ్వరి, ఆశాజ్యోతి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

భారతీయ జ్ఞానాన్ని యువతకు అందించాలి

ఇండియన్ నాలెడ్జ్ సిస్టం, నేషనల్ కోఆర్డినేటర్ గంటి సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి ఆధునిక యుగంలో భారతీయ జ్ఞాన సంపదను ఆధునిక యువతకు అందించాలని ఇండియన్ నాలెడ్జ్ సిస్టం, నేషనల్ కో ఆర్డినేటర్ గంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. స్కోప్ ఆఫ్ ఇంటర్ డిస్పెన్సరీ రీసెర్చ్ ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం అంశంపై రెండు రోజులు పాటు జరిగే జాతీయ సదస్సు జాతీయ సంస్కృత విశ్వవిద్యా లయంలో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జ్ఞానాన్ని నేటి ఆధునిక యువతకు అందించాలనే ఉద్దేశంతో ఇంటర్ డిస్పెన్సరీ రీసెర్చ్ ద్వారా బయటికి తీసుకురావచ్చనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రీసెర్చ్ స్కాలర్స్‌కు ఈ అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఆధునిక తరానికి అవసరమయ్యేలా మంచి పరిశోధ నలు చేసేందుకు ఈ సదస్సు ఉపయోగప డుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ సి లలితారాణి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ డిపార్టుమెంట్ వరిష్టా చార్యులు ప్రొఫెసర్ కె సూర్య నారాయణ, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ శివరాం, ఆర్ భట్, సభా సంచాలకులుగా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ ఆచార్యులు డాక్టరు సోమనాథ్ దాస్, విభిన్న విభాగాల అధ్యాపకులు, రీసర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ నాలెడ్జ్ సిస్టం, నేషనల్ కో ఆర్డినేటర్ గంటి సత్యనారాయణమూర్తి

సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ పరస్పర ఒప్పందం

జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం, సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ అధికారులు సుదర్శన్ సత్యనారాయణ ఆత్రేయతో సంస్కృత భాషలో ఉన్న వివిధ అంశాలను, సైన్స్, టెక్నికల్ ఫీల్డ్స్ ఉన్న వాటిలో మహత్తర అంశాలను వెలికి తీయడానికి రెండు సంస్థల మధ్య పరస్పర అవగాహన ఒప్పంద కుదుర్చుకున్నారు. ఈ మేరకు సోమవారం పరస్పర అవగాహన పత్రాలపై ఆ సంస్థల అధికారులు సంతకాలు చేసి అగ్రిమెంట్స్ తీసుకున్నారు.

క్రైం న్యూస్

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. వివాహేతర సంబంధం కారణంగా పల్లికాల ఆనందమ్మ (42)ను ఆమె అల్లుడు పాలెపు రమేష్ అత్యంత దారుణంగా కత్తితో కొట్టి హత్య చేశాడని తెలిపారు. వివాహిత అయిన ఆనందమ్మ వరుసకు అల్లుడు అయిన రమేష్‌తో గత కొంత కాలంగా సహజీవనం సాగిస్తోందని, నిందితుడు రమేష్ తన కుటుంబాన్ని వదిలి ముత్తరాలితో కలిసి వంట మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో తరచూ గొడవలు చోటుచేసుకునేవని ఈ క్రమంలో తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న ఆనందమ్మను తలపై కత్తితో గట్టిగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నా రు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - దొరవారిసత్రం: దాడి కేసులో ఒకరిని అరెస్టు చేశామని, మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం మేరకు..మండల పరిధిలోని మోదుగుల పాలెంలో ఆదివారం రాత్రి మాయారి సుబ్రహ్మణ్యంపై అదే గ్రామానికి చెందిన కొందరు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారని, ఈ సంఘటనలో సుబ్రహ్మణ్యంపై మారణా యుధంతో దాడి చేసి గాయపరిచిన శాంతాలం మాధవయ్యను మంగళవారం అరెస్టు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇందులో ప్రధాన నిందితులు పరారీలో వున్నారని త్వరలో వారిని పట్టుకుంటామని తెలిపారు.

15 మంది స్మగ్లర్లు అరెస్టు

- గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని సానిపాయ నిషేధిత అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తున్న 15 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి రంపాలు, గొడ్డళ్లు, నాలుగు కార్లు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్ఎస్ఐ సురేష్ బాబు సుండుపల్లి నుంచి కొలిమిమిట్ట వైపు స్థానిక అటవీశాఖ అధికారులతో కలసి కూంబింగ్ చేపట్టారని తెలిపారు. అక్కడ కొంతమంది నాలుగు కార్లలో దిగుతూ కనిపించగా, వారిని హెచ్చరించి చుట్టు ముట్టేందుకు యత్నించగా కొందరు పారిపోయారన్నారు. పారిపోతున్న వారిని టాస్క్ ఫోర్స్ సిబ్బంది చాకచక్యంగా వెంబడించి 15 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 11 మంది తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 22 కిలోల గంజాయిని మండల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటగిరి సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి వెలుగులోకి వచ్చింది. అక్రమంగా గంజాయిని కలిగి ఉన్న నరసింహ రోహిత్(తిరుపతి), నవీన్(మన్నసముద్రం)లపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. స్థానిక ఏర్పేడు పీఎస్‌లో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ జయచంద్ర మంగళవారం కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేసుకోవాలి

పజాశక్తి -కోట : కోట మండలంలోని ఊనుగుంటపాలెం, గూడలి రైతు సేవ కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది..'ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వారి పొలాల్లో భూసార పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: మండలంలోని పూజావారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అధికారిణి స్రవంతి అధ్యక్షతన నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి అధికార ప్రతినిధి ఎన్ చిన్నబాబు హాజరయ్యారు. జిల్లా పశుసంవర్ధక శాఖ డిడి ఉమామహేశ్వరి, పశు వైద్యులు జయ కిషోర్, ఉద్యాన శాఖ అధికారి సునీల్ , జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల పథకాలను వివరించారు. ఈ కార్యక్రమం లో సొరకాయల పాలెం మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, స్థానిక కూటమి నాయకులు రైతులు, మండల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ కోర్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు చార్టెడ్ అకౌంటెంట్ కోర్సుపై ఐసిఏఐ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చార్టెడ్ అకౌంటెంట్లు మన్నెల సింహాద్రి ఏజె విక్రమ్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వాణిజ్య శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున, కామర్స్ అధ్యాపకులు ఉష, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో కేఎస్‌జి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మండల స్థాయి అండర్–14, అండర్ –17 స్కూల్ గేమ్స్ లో కాసాగార్డెన్ బాలికల గురు కుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. 8వ తరగ తికి చెందిన వాసంతి 100 మీటర్ల పరుగు పందెం, హై జంప్ లో మొదటి స్థానం సాధించింది. షార్ట్ ఫుట్ విభాగంలో తృతీయ స్థానం సాధించి పాఠశాలకుపేరు తీసుకువచ్చింది. కోకో లో లాలిత్య, వాసంతి, సింధు, భానుప్రియ, మునిలక్ష్మి, భార్గవి, మేఘన, దినేష, జాహ్నవి లు విజేతలుగా నిలిచారు. పలు విభాగాల్లో పోటీపడ్డ విద్యార్థినులు ముందంజ వేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రభావతి మంగళవారం అభినందించారు.

పొగాకు నిర్మూలన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రుయా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పొగాకు వాడుక నిర్మూలన కేంద్రాన్ని ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్, రుయా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరిటెండెంట్ డాక్టర్ జె రాధ మంగళవారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం , జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా నిర్మూల కేంద్రంలో రుయాస్పత్రి ఆవరణలో ప్రతిరోజు తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక వైద్య, సిబ్బంది, అందుబాటులో ఉంటారని పొగాకు నిర్మూలన కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ హెచ్ హేమచంద్ర తెలిపారు.

'నెయ్యికి స్థానిక వనరులు సృష్టించాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నెయ్యి సేకరణకు స్థానికంగానే వనరులను సృష్టించుకుంటే బయటి ప్రాంతాల వారిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని, టీటీడీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా ఆలోచన చెయ్యాలని తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన మహాదేవ ధర్మపీఠం పీఠాదిపతి మహాదేవ్ స్వామిజీ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ నెయ్యి వెనుక ఉన్న ఎంతటి వారినైనా చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు.